శ్రీశ్రీశ్రీ సీతారామాలయ ప్రతిష్ట మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-బాడంగి/తెర్లాం: బాడంగి మండలం పినపెంకి గ్రామంలో శ్రీశ్రీశ్రీ సీతారామాలయ ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, వైసీపీ నాయకులు ఆహ్వానం మేరకు శనివారం స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హాజరై సీతారాములను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ప్రత్యేక సెలవు వర్తింపు

విశాలాంధ్ర-విజయనగరం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పోలింగ్ రోజున కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ప్రత్యేక సెలవు వర్తింపజేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీమతి ఏ సూర్యకుమారి తెలిపారు. ఏ.పి. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీతో పాటు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో పని చేస్తున్న కాంట్రాక్టు సిబ్బందికి కూడా ఈ సెలవు వర్తిస్తుందని పేర్కొన్నారు.

రాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాల కేటాయింపు

విశాలాంధ్ర-విజయనగరం : ఈ నెల 13 న జరగనున్న పట్టభద్రుల ఎన్నికకు సంబంధి0చి ఎన్నికల సిబ్బందికి రాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ్ జైన్ ఆధ్వర్యంలో శనివారం ఎన్.ఐ.సిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ , ఇతర పోలింగ్ సిబ్బందిని, మైక్రో అబ్జర్వర్లను రాండమ్ గా కేటాయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సూర్య కుమారి, డి.ఆర్.ఓ గణపతి రావు, ఎన్.ఐ.సి డి.ఐ..ఓ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

13న ఎన్నికలు

విశాలాంధ్ర-విజయనగరం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచార ఘట్టం శనివారంతో ముగిసింది. ప్రధాన రాజకీయ పక్షాల మద్దతు అభ్యర్థులంతా ఎవరికి వారే తమ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అన్ని రాజకీయ పక్షాల నుంచి తమ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ఆయా పార్టీల పెద్దలు రంగంలోకి దిగారు. ఇంటింటి తలుపుతట్టి తమ అభ్యర్థిని గెలిపించాలని పట్టభద్రులను కోరారు. వీరితో పాటు స్థానికంగా ఉన్న నాయకులు కూడా తమ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. ఒక పక్క ఇంటింటి ప్రచారం చేస్తూనే ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పట్టభద్రుల ఓట్లను తమ బ్యాలెట్ బాక్స్‌లో చేరాలనే ప్రయత్నాలను సాగించారు. మరికొంతమంది మద్దతుదారుల నుంచి పట్టభద్రుల ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలిపే వివరాలతో కూడిన సమాచారాన్ని తెలిపే ప్రయత్నాలు జరిగిందని సమాచారం. ఇలా ఏదో ఒక విధంగా పట్టభద్రుల ఓట్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేశారు. ఇక ఈ సారి ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా ప్రధాన రాజకీయ పక్షాల నడుమే సాగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు ఎమ్మెల్సీ గా ఉన్న పివిఎన్ మాధవ్ , మరోసారి పోటీకి సిద్ధపడ్డారు. వైసిపి అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్ బరిలోకి దిగగా, తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వేపాడ చిరంజీవి పోటీ చేస్తున్నారు. ఇక పీపుల్స్ డెమోక్రాటిక్ ఫ్రంట్ అభ్యర్థిగా కోరెడ్ల రమాప్రభ బరిలో ఉన్నారు. ఆమెకు మద్దతుగా వామపక్ష పార్టీలు ప్రచారాన్ని సాగించాయి. వీరితో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా కూడా పోటీకి సై అంటున్నారు. మొత్తం 44 అభ్యర్థులు 70 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల స్క్రూటీ్నీ లో నాలుగు నామినేషన్లను తిరస్కరించారు. మిగిలిన 40మందిలో ముగ్గురు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో 37 మంది అభ్యర్థులు ఎమ్మెల్సీ బరిలో మిగిలారు. ఈ నెల 13న ఎన్నికలు జరగనున్నాయి.

అభ్యర్థులకు మద్దతుగా బైక్ ర్యాలీ

సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - చీపురుపల్లి: ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటర్ మూడో సీరియల్లో సీతంరాజు సుధాకర్‌కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలి : జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) శనివారం చీపురుపల్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విజయనగరం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్, చీపురుపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గారిని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. వైసీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ కి మొదట ప్రాధాన్యతను ఓటును వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిందిగా కృషి చేయాలని నాయకులకు మరియు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో చీపురుపల్లి నియోజకవర్గం గల ప్రజా ప్రతినిధులు మరియు వైయస్సార్ కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రమాప్రభను గెలిపిస్తే ఉత్తరాంధ్ర వాణిని వినిపిస్తారు

సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఈ నెల 13న జరుగనున్న ఉత్తరాంధ్ర శాసన మండలి ఎన్నికల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. పట్టణంలోని గ్రాడ్యుయేట్ల ఇళ్లకు శనివారం వెళ్లి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థిగా సామాజిక కార్యకర్త, విద్యావేత్త డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అందరి నోళ్లలో నానుతున్నారని గుర్తు చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సమస్యల ప్రాతిపదికన అంశాల వారీగా ఆమె గొంతెత్తిన తీరు అందరినీ ఆలోచింప జేస్తోందని, రమాప్రభను గెలిపిస్తే ఉత్తరాంధ్ర సమస్యల వాణిని మండలి లో వినిపిస్తానని అన్నారు. అదేవిధంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి సాధన, వైజాగ్ స్టీల్ ప్లాంట్ రక్షణ, రైల్వే జోన్ సాధన, ఉద్యోగ, ఉపాధ్యాయులను వేధించే సిపిఎస్ రద్దుకు ఉద్యమం, నిరుద్యోగుల కోసం ఈ ప్రాంతంలో పరిశ్రమల సాధనకు పోరాటాలే అజెండాగా ఆమె పనిచేస్తారని స్పష్టం చేశారు. అన్నిచోట్ల రమాప్రభకు మంచి ఆదరణ లభిస్తుందని ఆనందం వ్యక్తపరిచారు.

ఓటు వేయుటకు ఎన్నికల కమిషన్ సూచించిన గుర్తింపు కార్డులు

విశాలాంధ్ర-విజయనగరం : జిల్లాలో ఈనెల 13న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో పోలింగ్ స్టేషన్ వద్ద గుర్తింపు కోసం ఓటర్లందరూ కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఓటరు కార్డు లేదా 12 రకాల ప్రత్యామ్నాయ గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి చూపించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సూర్య కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ గుర్తింపు కార్డు (ఈపీఐసీ) గాని ఈ దిగువ పేర్కొన్న 12 ప్రత్యామ్నాయ ఫోటో గుర్తింపు డాక్యుమెంట్లలో ఏదైనా ఒకటి సమర్పించి తమ ఓటు హక్కును ఓటర్లు వినియోగించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

1 ఆధార్ కార్డు.
2 ఎంఎన్ఆర్ఇజిఏ జాబ్ కార్డు
3 బ్యాంక్/ పోస్ట్ ఆఫీసు జారీచేసిన ఫోటో గ్రాఫ్ తో పాస్ పుస్తకాలు
4 కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ అయిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు
5 డ్రైవింగ్ లైసెన్స్.
6 పాన్ కార్డు.
7 ఎన్‌పిఆర్ కింద ఆర్.జి.ఐ చే జారీ చేయబడిన స్మార్ట్ కార్డు.
8 భారతీయ పాస్‌పోర్ట్ .
9 ఫోటో గ్రాఫ్ వున్న పింఛను డాక్యుమెంట్.
10. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ /పి.ఎస్.యు లు/ ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు జారీ చేసిన ఫోటోగ్రాఫ్ తో సర్వీసు ఐడెంటిటి కార్డులు.
11. ఎంపి/ ఎంఎల్ఏ/ ఎంఎల్.సి లకు జారీ చేసిన అధికార గుర్తింపు కార్డులు.
12. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం & సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన ప్రత్యేక అశక్తత గుర్తింపు కార్డు (యూనిక్ డిజెబిలిటీ ఐడి)

ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న ఇందుకూరి

విశాలాంధ్ర-వేపాడ/ఎస్ కోట : రాష్ట్ర వైఎస్ఆర్ పార్టీ ఉత్తరాంధ్ర పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బలపరిచిన సీతమ్మ రాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా ఎన్నికల ప్రచారంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దూసుకుపోతున్నారు. అలాగే సీతమరాజు గెలుపుపై పార్టీ నాయకులు కార్య కర్తలు శక్తి వంచన లేకుండా పనిచేసే గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎస్ కోట సర్పంచ్ గనివాడ సంతోషి ఎంపీటీసీ గౌరి నాయడు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నా చావుకు కారణం ..ఆ ముగ్గురే...!

యువతి ఆత్మహత్య కేసులో కొత్త ట్విస్ట్

యువతి రాసిన లేక లభ్యం..

విశాలాంధ్ర-జామి: మండలం లోని భీమసింగి పంచాయతీ కొత్త భీమసింగి గ్రామానికి చెందిన బోని మద్దిల జగదీశ్వరి అనే యువతి స్థానిక రైల్వేట్రాక్ పై ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి కీలకాధారం లభించింది. మృతురాలు ఆత్మహత్య చేసుకునేందుకు ముందుగా ఇంట్లో ఓ లేఖ రాసిపెట్టి వెళ్లిపోయింది. ఆ లేఖలో నా చావుకు కారణం చిన్ని రామకోటి, మార్న కళ్యాణ్, సరపనేటి వెంకటసాయి ఈ ముగ్గురి కారణంగా తాను మరణిస్తున్నానని ఆమె లేఖలో రాసింది. కుటుంబ సభ్యులు రామకోటి పైన వారి కుటుంబ సభ్యులపైన ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ అమ్మాయిని పెళ్లి చేసుకోమని వేధించడం వల్లే ఆమె మరణించినట్లు తెలిపారు. శుక్రవారం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అయితే ఇంటి వద్ద రాత్రి జగదీశ్వరి స్వహస్తాలతో రాసిన లేఖ లభించింది. దీనిని పోలీసులకు అందజేశారు.

డా. వేపాడ చిరంజీవరావుకు ఎమ్మెల్సీగా ఒక అవకాశం ఇవ్వండి

బొబ్బిలి టిడిపి ఇన్చార్జి బేబీ నాయనా విజ్ఞప్తి

విశాలాంధ్ర - రామభద్రపురం: తెలుగుదేశం పార్టీ బలపరిచిన డాక్టర్ వేపాడ చిరంజీవరావుకు ఎమ్మెల్సీగా ఒక అవకాశం ఇచ్చి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని బొబ్బిలి తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి నాయకులు బేబీ నాయన అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఉన్న పట్టభద్రులు వద్దకు వెళ్లి రావుకు మద్దతు ప్రాధాన్యత 1 నెంబర్ వేసి గెలిపించాలని కోరారు. చిరంజీవి రావు విద్యావంతుడు కాబట్టి ఆయనను గెలిపిస్తే రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తాడని అన్నారు. విద్యావంతులు, మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, పట్టభద్రులు అందరూ ఓటు వేసే ముందు ఆలోచించి ఎవరికి వేస్తే అభివృద్ధి జరుగుతుందో వారికే వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి చింతల రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కరణం విజయభాస్కర్, తారాపురం సర్పంచ్ ప్రతినిధి బెవర సీతా రాము, నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ యువత అధ్యక్షులు క ని మేరక రాము, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలించిన తాసిల్దార్ రాఘవ

విశాలాంధ్ర-గంట్యాడ : మండల కేంద్రమైన గంట్యాడలో గల జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ కేంద్రాలను తాసిల్దార్ ప్రసన్న రాఘవ శనివారం పరిశీలించారు. ఈ పాఠశాలలో మొత్తం మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఓటు వేసేందుకు వచ్చిన పట్టభద్రులకు క్యూ లైన్ లో నిలిచినందుకు వీలుగా భారీ కర్ణనులను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి వీలుగా ఫర్నిచర్ ను పరిశీలించారు. పోలింగ్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు సలహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ స్వర్ణ కుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు హరిప్రియ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

ఒక్క నిమిషం ఆలస్యం అయినా ఉపేక్షించేది లేదు

ఆర్ ఐ ఓ మజ్జి సత్యనారాయణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఈనెల 15 నుంచి ఏప్రిల్ నాలుగో తేదీ వరకు జరిగే ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని ఆర్ ఐ ఓ మజ్జి సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో గంట ముందుగా తమ యొక్క సెంట్రల్ వద్దకు హాజరు కావాలన్నారు. ఉమ్మడి జిల్లాల్లో మొత్తం 78 సెంటర్ల కేటాయించడం జరిగిందని వాటిలో ప్రైవేటు కళాశాలలో 42 , ప్రభుత్వ కళాశాలలో 36 గా నిర్ణయించడం జరిగిందన్నారు ఇప్పటికే సంబంధిత కళాశాలన్నిటికీ కూడా సీసీ కెమెరాలు యొక్క పర్యవేక్షించడం జరిగిందన్నారు. ముఖ్యంగా విద్యార్థులంతా ఒక్క నిమిషం ఆలస్యమైనా సరే పరీక్షా కేంద్రాల వద్దకు అనుమతించబోమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు జిల్లావ్యాప్తంగా 53 వేల 189 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరుకానున్నారు. అన్ని సెంటర్లో కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని పరీక్షలు నిర్వహణకు ఫ్లయింగ్ స్క్వాడ్ 4,సిటింగ్ స్క్వాడ్ 10 వీరితోపాటు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు . ఎప్పటికప్పుడు అన్ని కళాశాలలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత పరీక్షలు అన్నీ కూడా పూర్తిగా సీసీ కెమెరాల యొక్క పర్యవేక్షణలో జరుగుతుందన్నారు.

సీతంరాజు సుధాకర్ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ ప్రచారం

విశాలాంధ్ర-బెలగాం : ఏపి టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ తన పర్యటనలో భాగంగా వైసిపి పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ పార్వతీపురంలోని పిఎస్ఎన్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ సహచర ఉపాధ్యాయులను కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శాసనమండలి ఎన్నికలలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అమలు చేయబడిన అనేక సంక్షేమ పథకాలు ముఖ్యంగా విద్య మీద ప్రభుత్వం చేస్తున్న కృషిని, సామాజిక అభివృద్ధి కొరకు ప్రభుత్వం నుండి అందిస్తున్నటువంటి తోడ్పాటును ప్రచార కార్యక్రమాలలో వారికి సవివరంగా వివరిస్తూ విద్యావంతులు ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మెల్సీగా సీతం రాజు సుధాకర్ ని రాబోయే ఎన్నికలలో అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని, ప్రాధాన్యత క్రింద క్రమం ఓటు 1 గా సీతంరాజు సుధాకర్ పేరు ఎదురుగా వేసి, గ్రాడ్యుయేట్ ఓటర్లు అందరికి కూడా అవగాహన కల్పించి అత్యధిక మెజారిటీతో విజయం సాధించేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పిఎస్ఎన్ విద్యాసంస్థల ప్రతినిధులు పోలా సత్యనారాయణ, పెద్ద ఎత్తున గ్రాడ్యుయేట్ ఓటర్లు, బోను రామినాయుడు, మండల పకీరు నాయుడు, చుక్క లక్ష్ము నాయుడు, శ్రీనివాస్, బడే సింహాచలం నాయుడు, వివిధ సంఘాల ప్రతినిధులు, గ్రాడ్యుయేట్ ఓటర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

టూరిజం అభివృద్ధికి కృషి : జేసీ ఆనంద్



విశాలాంధ్ర-సీతంపేట: మన్యంలో పార్వతీపురం జాయింట్ కలెక్టర్ ఆనంద్ పర్యటించారు. తురాయిపువలస హెచ్ఎన్టిసి ఉద్యానవన ఫారం మరియు సెరికల్చర్, ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో ఏర్పాటు చేసినటువంటి జిమ్ పరిశీలించి జిల్లాలోని ఇటువంటి జిమ్ లేదని చాలా బాగుందని కితాభించారు. టూరిజం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ప్రభుత్వం నుండి నిధులు వచ్చే విధంగా ప్రతిపాదనలు పంపించి మన్యంలో మరిన్ని టూరిజం స్పాట్స్ అభివృద్ధి చేసి పర్యాటకు అందుబాటులో ఉండే విధంగా అందరూ కృషి చేయాలని తెలిపారు. ఈయనతో పాటు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి నవ్య, గిరిజన సంక్షేమ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు సిద్ధం

రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్. జవహర్ రెడ్డి

విశాలాంధ్ర-పార్వతీపురం: ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. మార్చి15 నుండి ఏప్రిల్ 4వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షల ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్. జవహర్ రెడ్డి శనివారం జిల్లా కలెక్టర్లు, పోలీసు, ఇంటర్మీడియట్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్. జవహర్ రెడ్డి మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని,పరీక్షాకేంద్రాల్లో మంచినీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు రవాణా సదుపాయాలు కల్పించాలని, ఉదయం 8.00 గంటలకల్లా పరీక్షాకేంద్రానికి చేరేవిదంగా ఏర్పాటుచేయాలని తెలిపారు. 9.00 గంటల తరువాత పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించడం జరగదని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయవలసినదిగా పోలీసు శాఖను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టరు అధికారులతో మట్లాడుతూ జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ ల సంఖ్యను పెంచాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షను అమలు చేయాలని, పరీక్షా పేపర్లు తీసుకొనివచ్చునపుడు, సమాధాన పత్రాలు తీసుకువెళ్లనపుడు అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలలోనికి విద్యార్థులు, సిబ్బంది మొబైల్ ఫోన్లు, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకువచ్చుటకు అనుమతించకూడదని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసరాలలో గల జెరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది ఒ.ఆర్.ఎస్. పేకెట్లు, మందులతో క్యాంపు ఏర్పాటుచేయాలని, పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరేలా ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. అధికారులు బస్సులను నడపాలని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, డి.ఎస్పీ ఎ. సుబాష్, జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారి డి. మంజులవీణలు పాల్గొన్నారు.

సుధాకర్ ను అఖండ మెజారిటీతో గెలిపించాలి : ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. శనివారం పార్వతీపురం మున్సిపాలిటీలోని పలు వార్డులతోపాటు మనిషి పేట మండలంలోని పెద పెంకి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఈనెల 13వ తేదీ సోమవారం నాడు జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి సభ్యుల ఎన్నికలలో బ్యాలెట్ నమూనాలో వరుస సంఖ్య 3 కి ఎదురుగా గల సీతంరాజు సుధాకర్ పేరుకు ఎదురుగా 1 ప్రాధాన్యత ఓటు వేసి పూర్తి మద్దతు కోరుతూ వారందరినీ అభ్యర్థించారు. అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ను అఖండ మెజారిటీతో గెలిపించాలని తద్వారా మన ప్రభుత్వంనకు పూర్తి మద్దతు ఇచ్చి విశాఖను పరిపాలన రాజధానిగా సాధించుకుందాం అని అందరికీ పిలుపు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ గుడివాడ నాగమణి, జెడ్పీటీసీ అలజంగి రవి కుమార్, వైస్ ఎంపీపీ వెలిది సాయిరాం, మండల పార్టీ అధ్యక్షులు పి మురళీకృష్ణ, సర్పంచ్లు నగిరి పాపారావు, ఏ సుందరరావు, కే వెంకటరమణ, జే సి ఎస్ కన్వీనర్ టీ శ్రీరాములు నాయుడు, వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రాడ్యుయేట్ ఓటర్లు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతును గెలిపించండి

విశాలాంధ్ర-కురుపాం : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి అయినటువంటి కోరడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు అన్నారు. శనివారం మండలంలో పట్టభద్రుల ఓటర్ల ఇంటి వద్దకు వెళ్లి తమ అమూల్యమైనటువంటి ఓటును బ్యాలెట్ నెంబర్ 11 లో కోరడ్ల రమాప్రభ కి పేరు కి ఎదురుగా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలుపుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ ,నిరుద్యోగ యువత సమస్యల పై పోరాడాలంటే శాసనమండలిలో ప్రశ్నించే గొంతు ఉండాలని అది కేవలం పిడిఎఫ్ అభ్యర్థులతోనే సాధ్యమవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ గిరిజన సంఘం నాయకులు కూరంగి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

పోలింగు కేంద్రాలు ఏర్పాటుచేసిన పాఠశాలలకు మాత్రమే ప్రత్యేక సెలవు

కలెక్టరు మరియు జిల్లా మేజిస్ట్రేటు నిశాంత్ కుమార్

విశాలాంధ్ర-పార్వతీపురం: ఆంధ్రప్రదేశ్ శాసనమండలి శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్టణం పట్టభద్రుల నియోజకవర్గానికి 13న ఎన్నికలు జరుగనున్నదృష్ట్యా పోలింగు కేంద్రాలు ఏర్పాటుచేసిన పాఠశాలలకు మాత్రమే మార్చి12 మరియు13 తేదీలలో ప్రత్యేక సెలవు ప్రకటించినట్లు కలెక్టరు మరియు జిల్లా మేజిస్ట్రేటు నిశాంత్ కుమార్ తెలియజేసారు. ఎన్నికలు జరిగేరోజున జిల్లాలోని ట్రెజరీలు, సబ్ ట్రెజరీలు మరియు అన్ని ఇతర కార్యాలయాలు,సంస్థలు యధావిధిగా పనిచేస్తాయని ఆయన ఈప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 16కేంద్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వీరఘట్టం, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నతపాఠశాల (బాలుర) సీతంపేట,జిల్లా పరిషత్ హైస్కూలు, భామిని,ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాలకొండ,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొమరాడ, ఎ.పి.టి.డబ్ల్యు.ఆర్. స్కూల్, (బాలురు) భద్రగిరి,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,కురుపాం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జియ్యమ్మవలస, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గరుగుబిల్లి, డివిఎం హైస్కూల్, బెలగాం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పార్వతీపురం, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల,మక్కువ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సీతానగరం, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, బలిజిపేట,ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సాలూరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాచిపెంటలలో పోలింగు ముందురోజు, పోలింగురోజున సెలవులు ప్రకటించినట్లు తెలియజేసారు. ఎన్నికల సెలవుపై స్పష్టమైన ప్రకటన చేయాలి:, ఉద్యోగ సంఘాల నాయకులు ఎన్నికలు జరిగే జిల్లాలో ప్రత్యేక సెలవు ఇస్తున్నట్లు శుక్రవారం జారీ చేసిన ఒకప్రకటనలో జిల్లా కలెక్టరు తెలియజేసి,శనివారంనాడు జారీచేసిన ప్రకటనలో ఎన్నికలు జరిగే పాఠశాలలకు మాత్రమే సెలవులని, మిగిలిన సంస్థలు యదావిదిగా పనిచేయాలని చెప్పడం గమనార్హం. అసలు సెలవు ఉందా లేదా అని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. గందర గోళంకు తెరదింపేల స్పష్టత ఇవ్వాలని వారంతా కోరుతున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లువేస్తారన్న నెపంతో ఇచ్చిన సెలవును రద్దు చేసినట్లని స్పష్టంగా తెలుస్తోంది. దీనిపై ఎన్నికల ముందు రోజున ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి మరి.

జాతీయ పురస్కారానికి 23 పంచాయతీల నామినేషన్లు

విశాలాంధ్ర-పార్వతీపురం/ సీతానగరం : ఉమ్మడి విజయనగరం,పార్వతీపురం మన్యం జిల్లాలో 2021-22 సంవత్సరానికి 23 పంచాయతీలు జాతీయ పురస్కారానికి నామినేషన్లు దాఖలు చేయగా జిల్లాస్థాయిలో తొమ్మిది విభాగాల్లో పురస్కారాలకు ఆయా పంచాయతీల పేర్లను ప్రతిపాదించినట్లు జిల్లా అధికారులు తెలిపారు.ఒక్కో విభాగంలో మూడేసి చొప్పున దేశవ్యాప్తంగా 27 పంచాయతీలకు జాతీయ పురస్కారాలను కేంద్రం ప్రకటిస్తుంది.విభాగాల వారీగా పరిశీలిస్తే పేదరికం లేని జీవనోపాధులు : నెమలాం-తెర్లాం మండలం, చినబొండపల్లి-పార్వతీపురం, దబ్బిరాజుపేట-వేపాడ, ఆరోగ్య పంచాయతీ : జివిఎల్ పురం, గర్భాం - మెరకముడిదాం, కొండ తామరాపల్లి-గంట్యాడ. చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ: నతివాడ-తెర్లాం, సారిపల్లి-నెల్లిమర్ల, గోపాలరాయుడు పేట-బొబ్బిలి. పూర్తిస్థాయి తాగునీరు : జోగింపేట- సీతానగరం, కె.పాలవలస -గరివిడి), సీతారాంపురం-ఎస్.కోట, పరిశుభ్రత, పచ్చదనం: జాకేరు -వేపాడ, ముకుందాపురం-వేపాడ, జోగింపేట-సీతానగరం, మౌలిక సదుపాయాల కల్పన: పెదగొట్టి-కురుపాం, గరుగుబిల్లి- గరుగుబిల్లి, గోపాలరాయుడుపేట-బొబ్బిలి. సామాజిక భద్రత :కొత్తపల్లి-గరుగుబిల్లి, రామభద్రపురం, ఎం. బూర్జవలస- బొబ్బిలి. గుడ్ గవర్నెన్స్ : మిర్తివలస- బలిజిపేట, జోగింపేట-సీతానగరం, పెదపెంకి - బలిజిపేట మహిళాభివృద్ధి : సీతారాంపురం-ఎస్.కోట, జానుమల్లువలస- సీతానగరం, దయానిధిపురం -సీతానగరంలను ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపారని జిల్లా పంచాయతీ అధికారులు తెలిపారు.

జోగమ్మపేటను మూడు అంశాల్లో ప్రతిపాదించడం ఆనందకరం

సర్పంచ్ కల్యంపూడి సింహాచలం: సీతానగరం మండలంలోని జోగమ్మపేట గ్రామపంచాయతీని పూర్తిస్థాయి త్రాగు నీరు కల్పన, పరిశుభ్రత- పచ్చదనం, గుడ్ గవర్నెన్స్ లోకలిపి మూడుఅంశాల్లో జాతీయ పురస్కారానికి ఎంపిక చేసి అధికారులకు ప్రతిపాదనలు పంపించడం పట్ల జోగమ్మపేట సర్పంచ్ కల్యంపూడి సింహాచలం హర్షం వ్యక్తంచేశారు. పంచాయతీ అభివృద్ధికి చేస్తున్న కృషిని అధికారులు గుర్తించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సర్పంచు, సచివాలయంసిబ్బంది, వాలంటీర్లు, గ్రామప్రజల సమిష్టి కృషితో ఇదంతా సాధ్యమని తెలిపారు. దీంతోపాటు మహిళాభివృద్ధిలో జానుమల్లువలస, దయానిధిపురంలు కూడా ఉత్తమ పురస్కారాలకు ప్రతిపాదనలు పంపించడంపట్ల ఆయాగ్రామాల సర్పంచులు వెంకటనాయుడు, రామారావు ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

రత్నప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి

విశాలాంధ్ర-సీతానగరం: ఉత్తరాంధ్ర జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టరు కోరెడ్ల రత్నప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి పట్టభద్రులు సహకారాన్ని అందించాలని సీపీఎం అనుబంద సంఘాల నాయకులు కోరారు.శనివారం చివరిరోజున పలుగ్రామాలలో ప్రచారాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో రెడ్డి లక్షునాయుడు, ఈశ్వరరావు, రమణమూర్తి, గవర వెంకటరమణ, గంట జ్యోతి, వెలమల రామలక్ష్మి తదితరులు కోరారు. వారంతా రత్నప్రభ గెలుపుకు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు

ఇంటి పేరు సవరణ

ర్యాంకు : **నాయక్ గోపి వంగపండు** 15327263 N2 Engr Regiment కేరాఫ్: 56 APo నేను ప్రస్తుతం తాళ్లబురిడిలో నివాసం ఉంటున్నాను. పార్వతీపురం మండలం విజయనగరం జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నా యొక్క కుమార్తె పేరు సర్వీస్ రికార్డులో **వి.కుల్షిత్రశ్రీ** గా తప్పుగా నమోదు అయినది. ఒప్పుగా **వంగపండు కుల్షిత్రశ్రీ** గా నాయొక్క సర్వీస్ రికార్డులో నమోదు చేయవలసినదిగా కోరుచున్నాను.

ఇంటి పేరు సవరణ

ర్యాంకు: **నాయక్ గోపి వంగపండు** 15327263 N2 Engr Regiment కేరాఫ్ : 56 APo నేను ప్రస్తుతం తాళ్లబురిడిలో నివాసం ఉంటున్నాను. పార్వతీపురం మండలం విజయనగరం జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నా యొక్క కుమారుడు పేరు సర్వీస్ రికార్డులో **వి. ప్రణీత్ సాయి**గా తప్పుగా నమోదు అయినది. ఒప్పుగా **వంగపండు ప్రణీత్ సాయి**గా నాయొక్క సర్వీస్ రికార్డులో నమోదు చేయవలసినదిగా కోరుచున్నాను.

వైసీపీ శాశ్వతంగా ప్రజల్లో ఉండే విధంగా కష్టించి పనిచేయాలి

రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కోలగట్ల

విశాలాంధ్ర-విజయనగరంటౌన్ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శాశ్వతంగా ప్రజల్లో ఉండే విధంగా కష్టించి పనిచేయాలని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం తన నివాసంలో పార్టీ జోనల్ ఇన్చార్జిలు, డివిజన్ కార్పొరేటర్ల తో సోమవారం జరగనున్న పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై పార్టీ శ్రేణులకు దిశనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపాదించిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతం రాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, ఈ రెండు రోజులు గెలుపుకు ఎంతో కీలకమని అన్నారు. ఆ దిశగా కష్టించి పని చేయాలన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల షెడ్యూలు విడుదలైన దగ్గర నుంచి, అత్యధికంగా ఓటర్లు నమోదు ప్రక్రియ చేయించి విజయనగరం నియోజక వర్గమే ముందంజలో ఉందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గ్రహిం చాలన్నారు. ఆఖరి ఘట్టమైన పోలింగ్ ప్రక్రియలో చురుకైన పాత్ర పోషించాలని అన్నారు. ఇలాంటి ఎన్నికలు పార్టీ శ్రేణులు కు ఎంతో అనుభవం ఉందని అన్నారు. విజయనగరం నియోజకవర్గానికి సంబంధించి ఉత్తరాంధ్ర పట్టభద్రులకు గాను 20 బూతులు ఏర్పాటు, ఐదు పోలింగ్ స్టేషన్ల లో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఇందులో విజయనగరం మండలానికి సంబంధించి పట్టభద్రులు ఓటర్లకు గాను మహారాజా ప్రభుత్వ సంగీత కళాశాలను కేటాయించడం జరిగింద న్నారు. మిగతా 18 పోలింగ్ బూతు లను మహారాజా కళాశాల, మహారాజా సంస్కృత కళాశాల, కంటోన్మెంట్ హై స్కూల్, కస్పా హైస్కూల్లో ఎన్నికల అధికారులు ఏర్పాటు జరిగిందన్నారు. పోలింగ్ ప్రక్రియను ప్రణాళికా బద్ధంగా జరిగే విధంగా చూడాలన్నారు. ఎన్నికల ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పోలింగ్ ప్రక్రియ పై పరిజ్ఞానం గల ఏజెంట్లను నియమించాలని అన్నారు. మే 1వ తేదీ తరువాత ప్రతి డివిజన్లో తాను పర్యటిస్తూ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, డివిజన్ పార్టీ అధ్యక్షులు, మహిళ విభాగంతో పాటు, ఆయా విభాగాల అధ్యక్షులు , పార్టీ శ్రేణులతో తాను సమావేశం నిర్వహిస్తానని అన్నారు. వీరికి డివిజన్ కార్పొరేటర్లు సముచిత స్థానం ఇవ్వాల్సిన అవసరం కూడా ఉందన్నారు. తల్లి లాంటి పార్టీ కోసం పార్టీ శ్రేణులు కొంత సమయం కేటాయించాల్సిన అవసరం కూడా ఉందన్నారు. పదవులు శాశ్వతం కాదు, పార్టీ ముఖ్యమన్న సంగతి ప్రతి ఒక్కరు గుర్తె రిగి పనిచేయాలని అన్నారు. పార్టీతోపాటు కార్య కర్తలు కూడా ముఖ్యమని, అందరినీ కలుపు కుంటూ పార్టీ పటిష్ట తకు కృషి చేయాలని అన్నారు. ఈ రెండు రోజులు వ్యక్తిగత పనులు పక్కన పెట్టి , పట్ట భద్రుల ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. పార్టీ జోనల్ ఇంచార్జ్ కోలగట్ల తమ్మన్న శెట్టి మాట్లాడుతూ ఎన్నికల ఏజెంట్లు పోలింగ్ కేంద్రాలలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పోలింగ్ ఏజెంట్ల పై ఎటువంటి క్రిమినల్ కేసులు లేని వారిని నియమించాలని అన్నారు. నగర పార్టీ అధ్యక్షులు ఆశపు వేణు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జోనల్ ఇంచార్జ్ డాక్టర్ వి ఎస్ ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు నడిపే న శ్రీనివాసరావు, నగర మేయర్ శ్రీమతి వెంపుడాపు విజయలక్ష్మి లు మాట్లాడారు. ఈ సమావేశంలో నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు, జే సి ఎస్ కన్వీనర్ సంఘం రెడ్డి బంగారు నాయుడు, జోనల్ ఇన్చార్జిలు మామిడి అప్పలనాయుడు, ముద్దాడ మధు, బొద్దాన అప్పారావు, కంటు భుక్త తవిటిరాజు, రెడ్డి గురుమూర్తి, ముచ్చు శ్రీనివాసరావు, గుజ్జల నారాయణరావు,అల్లు చాణక్య, ఎవర్న కుమారస్వామి, కాళ్ళ సూరిబాబు, తమ్ము, బాల బ్రహ్మారెడ్డి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

వేపాడ చిరంజీవిరావుకి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించండి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి విజ్ఞప్తి

విశాలాంధ్ర-చీపురుపల్లి : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, విజయనగరం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చీపురుపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ కిమిడి నాగార్జున ఆదేశాలమేరకు శనివారం చీపురుపల్లి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రౌతు కామునాయుడు చీపురుపల్లి కొత్త గవిడివీధి లో పట్టభద్రులను కలిసి ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జరిగింది. 13వ తేదీన జరగబోవు ఎమ్మెల్సీ ఎన్నికలో తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి వేపాడ చిరంజీవిరావుకి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరడమైనది.వారితో పాటు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చీపురుపల్లి మాజీ టౌన్ పార్టీ పార్టీ అధ్యక్షులు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రౌతు నారాయణరావు, గొల్లల ములగాం టీడీపీ ప్రెసిడెంట్ గడే సన్యాసప్పల నాయుడు,, మాజీ ఎంపీటీసీ ఆరతి సాహు, చీపురుపల్లి నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మండల చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జరుగుతున్న ఆదర్శ పాలనను చూసి ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు ను గెలిపించండి

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: రాష్ట్రంలో జరుగుతున్న ఆదర్శవంతమైన పాలన, అభివృద్ధిని చూసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. ఎస్.కోట పట్టణంలో పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ, పచ్చ మీడియా చేస్తున్న అసత్యప్రచారాలను విద్యావంతులైన పట్టభద్రులు గమనించాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ పేరు బ్యాలెట్లో 3వ నెంబరులో ఉంటుం దని, ఆయన పేరు ఎదురుగా ఉన్న గడిలో 1 అనే సంఖ్య వేసి విజ్ఞులైన పట్టభద్రులు గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్.కోట మేజర్ పంచాయితీ సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, ఎం.పి.టి.సి దారగిరి, మాజీ సర్పంచులు చామలాపల్లి బుజ్జి, ఆలుగుబిల్లి వెంకటరావు, నాయకులు గంగరాజు, వాకాడ రమణ, పొట్నూరు నాయుడు, మోపాడ నాయుడు, అర్జున్, మామిడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఈ స్కూల్ కు శాశ్వత రోడ్డు నిర్మంచరూ ....

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో సతివాడ గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠ శాలకు విద్యార్థులు వెళ్లేందుకు ఇప్పటికీ రోడ్డు లేకపోవడం విద్యార్థులు సందుల నుంచి, పెంట కుప్పల నుంచి, చెత్తా చెదారం మీదుగా స్కూల్‌కు వెళ్తుండడం చాలా బాధకరం అలాగే వర్షాకాలం వచ్చేటప్పుడు ముంగాల లోతు బురద నుంచి వెళ్ళే వాళ్ళం అని, అదే వేసవి అయితే ఎటునుంచి వెళ్లిన ఫర్వాలేదని విద్యార్థులు అంటున్నారు.ఈ విషయంపై ప్రధానో పాధ్యాయులు సత్యన్నారాయణను నిజమేనా ఈ స్కూల్ కు శాశ్వత రోడ్డు లేదా అని వివరాలు కోరగా, గ్రామ సర్పంచ్‌కు, గ్రామస్థులకు పలుసార్లు తెలుపడం జరి గిందని, స్కూల్ చుట్టూ ఉన్న స్థలాల రైతులతో మాట్లాడి స్కూల్‌కు రోడ్డు నిర్మిస్తామని

అంటున్నారు. ఇప్పటివరకు మాత్రం ఉపాధ్యాయులు కానీ విద్యార్థులు కానీ ఈ సందుల నుంచే వస్తున్నాం తప్ప మరి రహదారి ఇబ్బందులు ఎప్పుడు తీరుతాయి తెలియదని శనివారం కలిసిన విలేకర్ తో ఉపాధ్యాయులు తెలిపారు.

సీతంరాజు సుధాకర్ కు మద్దతుగా నగర. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ప్రచారం

విశాలాంధ్ర-విజయనగరంటౌన్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో ప్రచారానికి చివరిరోజు అయిన శనివారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సీతం రాజు సుధాకర్ కు మద్దతుగా నగర. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జి ఈశ్వర్ కౌశిక్ లు రాజీవ్ స్టేడియం తదితర ప్రాంతాలలో వాకర్సును, క్రీడాకారులను, కోచ్ లను కలసి పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓటు సీతంరాజు సుధాకర్ కు వేయాలని అభ్యర్థించారు. పట్టభద్రుల ఓటర్ల దగ్గర నుంచి వీరికి అనూహ్య లభించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, విద్యార్థిని విద్యార్థులకు విద్యా దీవెన, అమ్మ ఒడి, విదేశీ విద్య లాంటి కార్యక్రమాలు చేపట్టి ఎంతో మందిని పట్టబద్రులుగా తయారు చేశారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యతో పాటు , క్రీడా రంగానికి కూడా ఎంతో ప్రాముఖ్యత ఇస్తున్నారని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో రాజీవ్ స్టేడియం ప్రారంభించారని, రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామిలు క్రీడాకారులకు అనుగుణంగా రాజీవ్ స్టేడియాన్ని తీర్చిదిద్దారని అన్నారు. క్రీడాకారులకు కావలసిన మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో ముందుకు తీసుకు వెళుతున్నారన్నారు. గత 30 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధిని కేవలం మూడేళ్లలో చేసి చూపించారని అన్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తూ, నిత్యం ప్రజలతో మమేకమై ప్రజాహిత కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. రోడ్ల అభివృద్ధి, స్టేడియంల అభివృద్ధి, వాటర్ ట్యాంకుల నిర్మాణం, నగరంలో పలు ప్రధాన జంక్షన్లో అభివృద్ధి, పార్కుల అభివృద్ధి లాంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో ముందుకు తీసుకు వెళుతున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా రంజక పాలన, నియోజకవర్గంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పనితీరు తప్పక సీతంరాజు సుధాకర్ ను పట్టభద్రులు గెలిపిస్తారని నమ్మకం ఉందన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ళ సూరిబాబు, పైడితల్లి అమ్మవారి దేవస్థానం పాలక మండలి సభ్యులు ఎం కె బి, ఆర్కే యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలి

విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశంలో హెచ్.ఎం బి.లక్ష్మి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: పదవ తరగతి చదువు తున్న ప్రతి ఒక్క విద్యార్థి ఉత్తీర్ణులు కావాలని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మి ఆకాంక్షించారు. పదవ తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఎం బి.లక్ష్మి మాట్లాడుతూ ఏప్రిల్ మూడో తేదీ నుండి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల్లో ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణులయ్యేటట్లు కృషి చేయాలని తల్లిదండ్రులకు తెలియజేశారు. ఉపాధ్యాయులు రహీం షేక్ లాల్, వి ఈ సత్యనారాయణ, బి జయ, కిరణ్, సబీనా, శ్రావణి, అనంతలక్ష్మి మాట్లాడుతూ ఉన్న ఈ కొద్ది సమయంలో విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. టీవీ, సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలని తెలియజేశారు. మంచి ఆహార నియమాలు పాటించి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పిఎంసి చైర్మన్ తగరంపూడి రమణ, పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేసవిలో ముందస్తు జాగ్రత్తలు

విశాలాంధ్ర-బెలగాం: వేసవి దృష్ట్యా తీసుకో వాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం మండలం బాలగుడబ గ్రామం ఎర్ర చెరువు వద్ద ఉపాధి హామీ కార్మికులకు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పనుల నిమిత్తం బయటకు వెళ్లేటప్పుడు తప్పని సరిగా త్రాగు నీరు అందుబాటులో ఉంచుకోవాలని, మజ్జిగ, నిమ్మరసం, బార్లీ మొదలగు ద్రావణాలను ఎప్పటికప్పుడు తీసుకోవాలని, నూనె, క్రొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారంకు దూరంగా ఉండాలని ఇవి శరీరంలో నీటి శాతం తగ్గిస్తాయని తద్వారా డీహైడ్రేషన్ కు గురవుతామని అన్నారు. వృద్ధులు, నవజాత శిశువులు, గర్భిణీల విషయంలో మరింత జాగ్రతలు అవసరమని వీలైంత వరకు నీడగా, చల్లగా ఉండే ప్రదేశాల్లో ఉండాలన్నారు. ఓఆర్ఎస్, జింక్, పారా సెటమల్ మందులు గ్రామాల్లో, ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఒఆర్ఎస్ ద్రావణం తయారు చేసుకునే విధానాన్ని డిఐఒ జగన్మోహనరావు దగ్గరుండి చేసి చూపించి, అక్కడ పని చేస్తున్న పలువురిచే త్రాగించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ జయగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ కె. తాతబాబు, ఎఎన్ఎమ్ రామలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం

విశాలాంధ్ర-బాడంగి/తెర్లాం: జిల్లా విద్యాశాఖది కారి ఆదేశాల ప్రకారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల బాడంగిలో చదువుతున్న పదోతరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ప్రధానో పాధ్యాయులు సిద్ధాంతం త్రినాధరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో త్వరలో జరగబోవు పదోతరగతి పరీక్షలలో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణులు కావాలంటే ఉపాధ్యాయులు బాధ్యతతో పాటు తల్లిదండ్రుల బాధ్యత కూడా ముఖ్యమని విద్యార్థులందరూ పరీక్షలు అంటే భయంవీడి ప్రశాంత వాతావరణంలో ఉండి రాయాలని మంచి పోషకాహారం తినాలని తల్లిదండ్రులు అందరూ విద్యార్థులు ఇంటివద్ద చదివించాలని టీవీ, సెల్‌ఫోన్ దూరంపెట్టాలని, పరీక్షకు గంటముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని తెలుపుతూ విద్యార్థులు పై చదువులకోసం పాలిటెక్నిక్ డిప్లమా, ఇంటర్, ఐటిఐ, ట్రిపుల్ ఐటి వంటి పోటీపరీక్షలకు కూడా ఇప్పటినుండే దరఖాస్తు చేయాలని దివ్యాంగ విద్యార్థులు కూడా శత శాతం ఉత్తీర్ణులు కావాలని తెలిపారు. గ్రాండ్ టెస్ట్ లో టాప్ టెన్ విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2.25లక్షల ఉద్యోగాల కల్పన : ఎమ్మెల్యే కడుబండి



విశాలాంధ్ర-శృంగవరపుకోట: వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన అనతికాలంలోనే ఒకే నోటిఫికేషనుతో 1.34లక్షల సచి వాలయ ఉద్యోగాలు కల్పించారని, అలాగే వైద్యారోగ్య శాఖతో పాటు మిగిలిన శాఖల్లో ఖాళీలను భర్తీ చేసి మొత్తంగా 2.25 లక్షల ఉద్యోగులను నియామకం చేయడం జరిగిందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఇక విశాఖపట్నం వేదికగా ఇటీవల జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ ద్వారా త్వరలో భారీ పరిశ్రమలు రాష్ట్రంలో ఏర్పాటు కానున్నందున 6లక్షల ఉద్యోగాలు యువతకు రానున్నాయని వెల్లడించారు. విద్యావేత్తలయిన పట్టభద్రులు ఈ వాస్తవాలను గుర్తించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థించారు. ఎస్.కోట మండలం, శివరామరాజుపేట గ్రామంలో వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే కడుబండి శనివారం పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ హయాంలో గ్రాఫిక్స్ పాలన, జన్మభూమి కమిటీల దోపిడీ జరిగిందని ఆరోపించారు. గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్లు నిర్మాణం, నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల అభివృద్ధి జరిగిన మాట వాస్తవం కాదా అని గుర్తు చేశారు. త్వరలో విశాఖ కేంద్రంగా సీఎం పరిపాలన సాగించనున్నారని, దీంతో మన ఉత్తరాంధ్ర జిల్లాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతాయని స్పష్టం చేశారు. పట్టభద్రులంతా మొదటి ప్రాధాన్యత ఓటును ఎమ్మెల్సీ సీతంరాజు సుధాకర్ కు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే కడుబండి వెంట రాష్ట్ర ఫోక్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్ ను గెలిపించాలి



విశాలాంధ్ర-సీతానగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న సీతంరాజు సుధాకర్ కు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే సవరపు జయమని భర్త, రిటైర్డ్ టీచర్, వైఎస్సార్సీపీ నాయకుడు సవరపు రామారావు విజ్ఞప్తి చేశారు.శనివారం ఆయన పెదబొగిలి మేజర్ పంచాయతీలోని పట్టభద్రుల ఓటర్ల ఇళ్లకు వెళ్లి ప్రచారాన్ని నిర్వహించారు. పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, గ్రాడ్యుయేట్ ఓటర్లు ఆలోచనచేసి సీఎం వైఎస్ జగన్ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ కు మొదటి ప్రాధాన్యత ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్టీ అధిష్టానం సూచనలు మేరకు అన్ని గ్రామాలలో ఓటర్లను కలుస్తూ ఓటు వేయాలని కోరుతున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు మాజీ ఎంపిటిసి మాధవ పాల్గొన్నారు

బీజేపీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి

విశాలాంధ్ర-పార్వతీపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి సభ్యునిగా బీజేపీ తరపున పోటీ చేస్తున్న పి వి ఎన్ మాధవ్ కు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని పార్వతీపురం మన్యం జిల్లా బీజేపీ అధ్య క్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు మరో 26గంటల్లో ప్రారంభం కాను న్నాయని, విజ్ఞత కలిగిన విద్యావంతులైన ఓటర్లు ఆలోచనచేసి ఓటును వేయండని కోరారు. ఎన్నికల ప్రచారం చివరిరోజున ముమ్మరంగా చేశారు. ఈకార్యక్రమంలో ఆయనతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీశివసాయి గణేష అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవం

స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన టీడీపీ యువనేత గొంప కృష్ణ, నేతలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : శృంగవరపుకోట మండలం, వసి గ్రామంలోని శ్రీశివసాయి గణేష అభయాంజనేయ తీర్థ మహోత్సవానికి ముఖ్య అతిధిగా టీడీపీ యువనేత గొంప కృష్ణ శుక్రవారం రాత్రి హాజరయ్యారు. ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు సంప్రదాయంగా స్వామి వారిని దర్శించుకుని హెూమం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువనేత గొంప కృష్ణను ఆలయ కమిటీ ప్రతినిధులు శాలువాతో సత్కరించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా గొంప కృష్ణ మాట్లాడుతూ సంప్రదాయం ప్రకారం తీర్థ మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన కమిటీ సభ్యులను అభినం దించారు. అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యువనేత కృష్ణ వెంట టీడీపీ విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, మండల కార్యదర్శి జుత్తాడ రామ సత్యం, నాయకులు కిలపర్తి హరి, ఆదారి రమేష్, ఆదారి మహేష్, లగుడు వెంకట్రావు, లగుడు ఏర్నాయుడు, గోగాడ వెంకటరావు, బొబ్బిలి శ్రీను, రవి వర్మ, మండ త్రినాధ, శ్రీను రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిం చాలని రవాణా శాఖ సహాయ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎన్. రమేష్ కుమార్ అన్నారు. పార్వతీ పురం సురేష్ పాఠశాలలో రహదారి భద్రత అవగాహన కార్యక్రమాన్ని రవాణా శాఖ నిర్వహించింది. విద్యార్థి దశలో నిబంధనలు పాటించడం వలన అలవాటుగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. మంచి అలవాటు జీవితానికి మంచిదని చెప్పారు. అందరూ రహదారులను ఉపయోగిస్తారని, అయితే కొద్దిపాటి అవగాహనతో ప్రమాదాలు నివారించవచ్చని ఆయన అన్నారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు, చుట్టు ప్రక్కల వారికి, స్నేహితులకు తెలియజేయాలని తద్వారా అందరూ నిబంధనలు పాటించి సంతోషంగా ఉండగలరని చెప్పారు. అధిక వేగం ప్రమాదాలకు కారణం అవుతుందని ఆయన పేర్కొన్నారు. నిబంధనలు పాటించక, వేగంగా వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారని, కుటుంబాలు కష్టాల్లో పడుతున్నాయని ఆయన చెప్పారు. రహదారి దాటేటప్పుడు రెండు వైపులా గమనించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ వైద్యులు డా. డి. నారాయణ రావు, ఏఎస్ ఐ టి. భాస్కర రావు, పాఠశాల ప్రిన్సిపాల్ సాహు, కరస్పాండెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి వ్యాధి నిరోధక టీకాలు

జిల్లా క్షయ నియంత్రణ అధికారి డా. రామేశ్వరి

విశాలాంధ్ర-జామి : అర్హులైన ప్రతి ఒక్కరికి వ్యాధి నిరోధక టీకాలు అందేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రామేశ్వరి సూచిం చారు. స్థానిక జామి పిహెచ్సి పరిధిలోని జామి, మిడతాన వారి కల్లాలలో టీకాల కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీకాలను శీతలీకరణ సమయంలో నిల్వ చేసుకొని ప్రతి గర్భిణీకి చిన్నారులకు డ్రాప్ అవుట్స్ లేకుండా సరైన సమయంలో వేయా లన్నారు. వేసవి కాలంలో ముందుగా టీకాల సెషన్ ప్రారంభమయ్యేలా తగిన ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. రక్తహీనత ప్రమాదాన్ని ప్రతి గర్భిణీ నుంచి ముందుగా గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సుఖ ప్రసవం అయ్యేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఆశా కార్యకర్తలు ఆశ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ నోడల్ ఆఫీసర్ డి పి హెచ్ ఎన్ ఓ వసంత లక్ష్మి, స్థానిక పీహెచ్సీ హెల్త్ ఎడ్యుకేటర్ ఎన్ అనిల్ ప్రేమ్ కుమార్, సూపర్వైజర్స్ భవాని, సత్యనారాయణ, ఏఎన్ఎంలు లత, లక్ష్మి, ఎమ్ ఎల్ హెచ్ పిలు నిహారిక, లిఖిత ,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

టీడీపీ ముమ్మర ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం...



విశాలాంధ్ర-కురుపాం: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ సమయం దగ్గర పడటంతో తెలుగుదేశం పార్టీ ప్రచా రం ను శనివారం ముమ్మరం చేశారు. కురుపాం లో ప్రభుత్వ పాఠశాలల్లో , కళాశాలలు కార్యాలయల్లో ప్రచారం చేపట్టారు. మొదటి ప్రాధాన్యత టీడీపీ అభ్యర్థి వేపాడ చిరంజీవి కే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ నమూనా బ్యాలెట్, కరపత్రాలు ఓటర్లు కు పంపిణీ చేశారు. ఈ ప్రచారంలో నాయకులు పువ్వుల. లావణ్య ,జివి రమణమూర్తి, తాడంగి రామారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి అస్వస్థత

విశాలాంధ్ర-బెలగాం : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి అస్వస్థతకు గురైన సంఘటన శనివారం ఉదయం జరిగింది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసుల వివరాలివి. గరుగుబిల్లి మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన తూముల శ్రీను ఆటో డ్రైవరు. ఉద్దవోలు ఆటో స్టాండులో శనివారం ఉదయం ఆటోను సీరియల్ లో పెట్టి ఇంటికి వచ్చి భార్య జానకిని గంజి అన్నం పెట్ట మనగా పెడితే తిని కొద్ది సేపు పడుకున్నాడు. జానకి ఇంటిలో బట్టలు ఉతికి మేడపై ఆరబె డుతుండగా ఈలోగా శ్రీను బయటకు వెళ్లి పురుగుల మందు తెచ్చుకొని తాగి జానకీ నేను చచ్చిపోతాను... బ్రతకను అని కేకలు వేయగా జానకి పరుగెత్తుకొని కిందకి వచ్చి చూసేసరికి చేతిలో పురుగులు మందు డబ్బా పట్టుకొని త్రాగి పడి ఉండడంతో వెంటనే బయటకు వచ్చి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి అతడ్ని 108కు సమాచారం ఇచ్చి అతడ్ని 108లో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకొని రాగా వైద్యులు చికిత్స అందించారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదుచేసినట్లు తెలిపారు. ఎందుకు తాగాడనేదీ శ్రీనుకు తెలివి వస్తేగాని తెలియదు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-కురుపాం: ఈనెల 13న నిర్వహిం చబోయో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని తహశీల్దార్ ఆర్. రమేష్ కుమార్ తెలిపారు. కురుపాం మండలంఈ పోలింగ్ బూత్ నంబర్ 72లో 582మంది తమ ఎమ్మెల్సీ ఓటుహక్కును వినియోగించుకోనున్నారని తెలి పారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తమ ఓటు హక్కును వినియోగించు కునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది పద్మిని ,సుదీర్ ,విఆర్ ఎ ఈశ్వర రావు పనులు పర్యవేక్షణ చేశారు.

నేడు శ్రీకృష్ణ ఆలయం తృతీయ వార్షికోత్సవం

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని వావిల పాడులో గల శ్రీ కృష్ణ ఆలయం తృతీయ వార్షి కోత్సవం వేడుకలు ఆది వారం ఘనంగా నిర్వహి స్తున్నట్లు గ్రామ యాదవ సంఘం తెలిపింది. ఆదివారం ఉదయం 6గంటల నుండి స్వామివారికి దీప ధూపం నైవేద్యములతో పాటు ప్రత్యేక పూజలు జరుపబడును. అలాగే మధ్యాహ్నం 12 గంటల నుండి భారీ అన్న సమారాధనతో పాటు స్వామివారి ప్రసాదాలు భక్తులకు అందిస్తారు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుండి ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని ఉత్సవ కమిటీ తెలిపింది. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యాదవ్ కమిటీ సభ్యులు కోరారు.

వైసీపీ ని నమ్మి మరోసారి మోసపోవద్దు

పొలిట్ బ్యూరో సభ్యురాలు సంధ్యారాణి

విశాలాంధ్ర-పాచిపెంట: వైసీపీ ప్రభుత్వాన్ని నమ్మి గ్రాడ్యుయేట్లే మరోసారి మోసపోవద్దని మాజీ ఎమ్మెల్సీ టిడిపి పోలీసు బ్యూరో సభ్యురాలు గుమ్మ డి సంధ్యారాణి అన్నారు. మండలంలో గల పాంచాలి గ్రామంలో గల అన్ని పాఠశాలకు వెళ్లి టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి వ్యాపాడ చిరంజీవి రావు గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఆలు పెరగకుండా శ్రమించి గెలిపించాలని కోరారు రానున్నది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమేనని ఆమె అన్నారు మొదటి ప్రాధాన్యత ఓటును వేపాడ చిరంజీవి రావు వేసి విధంగా అభ్యర్థులకు తెలియజేయాలని కోరారు వైసీపీ ప్రభుత్వాన్ని నమ్మి మరోసారి మాస పోవద్దని విద్యావంతులు ఉద్యోగస్తులు గుణపాఠం చెప్పాలని ఆమె అన్నారు. జగన్ ప్రభుత్వం విద్యార్థులకు ఉద్యోగస్తులకు ఆర్థికంగా మానసి కంగా అనేక ఇబ్బందులు గురిచేసిన విషయాన్ని తెలియజేశారు. విద్యావంతులు గుర్తించి టీడీపీ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేపాడ చిరంజీవిరావును అత్యధిక మెజార్టీతో గెలిపించి వైసిపికి తగిన బుద్ధి చెప్పాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పరిశీలకులుగా రాజమండ్రి నుంచి వచ్చిన చెల్లు బోయిన శ్రీని వాసరావు తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొని ఓటర్లు కలిసి చిరంజీవి రావుకు ఓటు వేయాలని కోరారు.

సాహితీప్రపంచంలో పతంజలి ది ప్రత్యేక శైలి

సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి



విశాలాంధ్ర విజయనగరం : ప్రముఖ రచయిత, సీనియర్ పాత్రికేయుడు అనేక తెలుగు దినపత్రిక లకి ప్రధాన సంపాదకులు గా పనిచేసిన స్వర్గీయ కాకర్లపూడి నారసింహయోగ పతంజలి కి తెలుగు సాహిత్య లోకంలో ప్రత్యేకత ఉందని అటువంటి గొప్ప మనిషి సమాజానికి దూరమై 14 సంవత్సరాలు కావడం ఎంతో బాధ ఉందని కె.ఎన్. వై.పతంజలి సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు, పతంజలి వర్ధంతి సందర్భంగా శనివారం గురజాడ కేంద్ర గ్రంథాలయం ఆవరణలో ఉన్న పతంజలి విగ్రహం కి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు అనంతరం భీశెట్టి మాట్లాడుతూ పతంజలి నిగర్వి,నిరాడంబరుడు,మర్యాదస్తుడుగా,సాహిత్య లోకంలో ఎవ్వరూ వేలెత్తి చూపలేని వ్యక్తి గా జీవించారని, పత్రికల్లో సంపాదకీయాలు రాసినా, సినిమా కి మాటలు రాసినా, ఆయుర్వేదం మాత్రలు రోగికి ఇచ్చినా అంతే ఇష్టం తో ఆర్తి తో చేసారని, పతంజలి ప్రతి కదా సమాజంలోని దూరాగతాలను ఎత్తిచూపినవేనని ప్రతి కథలో దుర్మార్గం, వంచితనాన్ని కలిపి సమాజానికి అందించారని అన్నారు,పతంజలి కళింగాంధ్ర నుడికారానికి కనకాభిషేకం చేసారని ప్రతి కథలో నగటి మనిషి జీవితాన్ని విపులీకరించారని అన్నారు అటువంటి గొప్ప రచయిత విజయనగరం జిల్లా అలమండ వాసి కావడం జిల్లా ప్రజల అదృష్టమని అన్నారు. వేదిక కార్యదర్శి ఎన్. కె.బాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 29 పతంజలి జయంతి సందర్భంగా తమ వేదిక రాష్ట్ర స్థాయి లో అందించే పురస్కార గ్రహీత పేరుని త్వరలో తమ కమిటీ ప్రకటిస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్ వర్మ, వేదిక ప్రతినిధులు సీనియర్ పాత్రికేయుడు భళ్లమూడి నాగేంద్ర ప్రసాద్,సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

72 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

జిల్లాకు చేరుకున్న బ్యాలెట్ పత్రాలు

ఓటుహక్కు వినియోగించుకోనున్న 58,502 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు

13న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు పోలింగ్

విశాలాంధ్ర-విజయనగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ కోసం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీమతి ఏ.సూర్యకుమారి ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికకోసం మార్చి 13న పోలింగ్ జరుగనుంది. ఆరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఓటర్లందరికీ బి.ఎల్.ఓ.ల ద్వారా ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తిచేశారు. జిల్లా ఎన్నికల యంత్రాంగం అందజేసిన ఓటరు స్లిప్పు ఆధారంగా ఓటరు జాబితాలో ఓటర్ల పేరు గుర్తించేందుకు అవకాశం వుండటంతో ఓటరు స్లిప్పుల పంపిణీకి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. పోలింగ్ కేంద్రం సమీపంలో కూడా ఓటరు స్లిప్పులు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఓటర్లు ...

జిల్లాలో 58,502 మంది పట్టభద్ర ఓటర్లు వుండగా వీరికోసం జిల్లా యంత్రాంగం 72 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో మొత్తం ఓటర్లలో 38,625 మంది పురుషులు, 19,868 మంది మహిళా ఓటర్లు, 9 మంది థర్డ్‌జెండర్ ఓటర్లు వున్నారు. విజయనగరం డివిజన్‌లో అత్యధికంగా 33,643 ఓటర్లు వుండగా, చీపురుపల్లిలో 14,256 మంది, బొబ్బిలిలో 10,603 మంది ఓటర్లు వున్నారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

లిజిల్లాలో పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం 72 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. విజయనగరం డివిజన్‌లో 42, బొబ్బిలిలో 13, చీపురుపల్లిలో 17 చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. ఒక్క విజయనగరం పట్టణంలోనే 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి.

ఎన్నికల సామగ్రి పంపిణీ

లిజిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం అవసరమైన సామాగ్రిని పంపిణీ చేసేందుకు ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు మూడు డివిజన్ కేంద్రాల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. విజయనగరం డివిజన్‌కు ఆర్.డి.ఓ. కార్యాలయంలోనూ, చీపురుపల్లికి సంబంధించి ఎస్.డి.ఎస్.కళాశాల, గరివిడిలోనూ, బొబ్బిలి తహశీల్దార్ కార్యాలయంలోనూ ఎన్నికల సామాగ్రి పంపిణీకి ఏర్పాట్లు చేశారు. మార్చి 12న ఉదయం 8 గంటల నుంచే సామాగ్రి పంపిణీకి అన్ని ఏర్పాట్లు సిద్ధంచేశారు. ఎన్నికల సామాగ్రి పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు 15 ఆర్టీసీ బస్సులను కూడా ఏర్పాటు చేశారు.

ఎన్నికల సిబ్బంది నియామకం

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సజావుగా జరిపేందుకు తగిన సంఖ్యలో పోలింగ్ సిబ్బందిని కూడా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నియమించారు. 72 పోలింగ్ కేంద్రాలకు 72 మంది పి.ఓ.లతో పాటు రిజర్వులో మరో 18 మందిని పి.ఓ. విధులు నిర్వహించేందుకు సిద్ధంచేస్తున్నారు. 72 మంది ఏ.పి.ఓ.లు 18 మంది రిజర్వు ఏపిలు, 144 మంది ఓపిఓలు, మరో 41 మంది రిజర్వు సిబ్బందిని నియమిస్తున్నారు. వీరందరికీ ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు పూర్తిచేసి ఉత్తర్వులు కూడా జారీచేశారు.

జోనల్, రూట్ అధికారుల నియామకం

జిల్లాను 13 జోన్లుగా విభజించి 13 మంది జోనల్ అధికారులను నియమించారు. దీంతోపాటు 13 రూట్లుగా విభజించి 24 మంది రూట్ అధికారులను నియమించారు.

మైక్రో అబ్జర్వర్ల నియామకం

ఎన్నికలు సక్రమంగా, సజావుగా జరిగేలా తగిన పర్యవేక్షణ చేసే నిమిత్తం ఎన్నికల సంఘం 72 మంది కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మైక్రో అబ్జర్వర్లగా నియమించింది. వీరికి అదనంగా మరో 18 మంది రిజర్వు అబ్జర్వర్లను కూడా నియమించారు. పోలింగ్ తీరును గమనించి దీనిపై ఎన్నికల సంఘానికి వీరు నివేదికలు అందజేస్తారు. వీరికి ఇప్పటికే రెండు విడతల శిక్షణ కూడా పూర్తిచేశారు.

బ్యాలెట్ బాక్సులు, పేపర్లు సిద్ధం

లిఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం జిల్లాకు 229 పెద్ద సైజు బ్యాలెట్ బాక్సులను ఎన్నికల సంఘం సరఫరా చేసింది. వీటికి అదనంగా మరో 100 రిజర్వు బ్యాలెట్ బాక్సులు కూడా సరఫరా చేశారు. ఎన్నికల పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ పత్రాలను ఇప్పటికే జిల్లా కేంద్రానికి చేర్చారు. బ్యాలెట్ పత్రాల తనిఖీ కూడా జిల్లా స్థాయిలో పూర్తిచేసి స్ట్రాంగ్ రూంలో వుంచారు.

కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూంలి

పోలింగ్ రోజున ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సరళిని పరిశీలించేందుకు జిల్లా పరిషత్ సి.ఇ.ఓ. ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి రెండు గంటలకు నమోదైన ఓట్లను తెలుసుకోవడంతో పాటు ఆయా కేంద్రాల్లో పోలింగ్ జరుగుతున్న విధానం, ఎక్కడైనా శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమయ్యిందీ లేనిదీ వంటి సమస్యలు కూడా తెలుసుకుంటారు. జిల్లా కలెక్టర్ ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచే ఎన్నికల పర్యవేక్షణ చేస్తారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు

జిల్లాలో ఏర్పాటు చేసిన 72 పోలింగ్ కేంద్రాల్లోనూ ఓటర్లకు అవసరమైన కనీస వసతులు కల్పించేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. తాగునీటి సదుపాయాలు, ప్రాథమిక వైద్యచికిత్స, ఓటర్లు నిల్చునేందుకు తగిన నీడ కల్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. అధిక సంఖ్యలో ఓటర్లు వుండే కేంద్రాల్లో బ్యారికేడ్లు వంటి ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. ఎన్నికల సరళిని వర్చ్యువల్ గా పరిశీలించేందుకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. 72 కేంద్రాల్లోనూ సిసి కెమెరాలను ఏర్పాటు చేసి పోలింగ్ జరుగుతున్న తీరును జిల్లా కేంద్రం నుంచి జిల్లా కలెక్టర్ తదితరులు పర్యవేక్షిస్తారు.

కలెక్టర్ కార్యాలయంలో రిసెప్షన్ సెంటర్

=లిపోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్సులు తరలించి భద్రపరిచేందుకు కలెక్టర్ కార్యాలయంలో రిసెప్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అన్ని ప్రాంతాల నుంచి బ్యాలెట్ బాక్సులు చేరిన తర్వాత వాటిని స్ట్రాంగ్‌రూంలో భద్రపరచి ఇక్కడి నుంచి విశాఖకు తరలించే ఏర్పాట్లు చేస్తారు.

పట్టభద్రుల ఓటర్లు మీరు వేసే ఓటు విధానం ఇలా..!

తహశీల్దార్ డి.శ్రీనివాసరావు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఈనెల 13న (సోమవారం) గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్ జరగనుందని, పట్టభద్రులు మీరు వేసిన ఓటు చెల్లుబాటు కావడానికి తప్పనిసరిగా ఈ విధానాలు పాటించాల్సిన అవసరం ఉందని తహశీల్దార్ డి.శ్రీనివాసరావు సూచించారు. ఎస్.కోట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 137, 138, 137ఎ, 138ఎ పోలింగ్ బూతులను ఎస్.ఐ జె.తారకేశ్వరరావు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ తో కలిసి తహశీల్దార్ శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన 'విశాలాంధ్ర' ప్రతినిధితో మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గం.ల వరకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. ఓటు వేసేందుకు వెళ్లే గ్రాడ్యుయేట్స్ ఎన్నికల కమిషన్ సూచించిన ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకెళ్లాల్సి ఉంటుంది. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసే విధానానికి, ఎమ్మెల్సీలో వేసే దానికి చాలా తేడా ఉంటుందన్న విషయం గుర్తించాలన్నారు.

- ఇవి చేయాలి..

బ్యాలెట్ పత్రాల్లో పార్టీ గుర్తులుండవు. కేవలం అభ్యర్థుల చిత్రాలు, పేర్లు ఉంటాయి. మనం ఓటు వేసేందుకు ఎంచుకున్న అభ్యర్థుల ఎదురుగా 1,2,3 ఇలా అంకెలు మాత్రమే వేయాలి. అభ్యర్థుల పేరుకు ఎదురుగా ప్రాధాన్య సంఖ్యలో ఓటు వేయాలి. ఒకటో నెంబరు (1) తప్పనిసరిగా వేయాలి. ఆ తర్వాతి ప్రాధాన్యం 2, 3 వేసినా పరవాలేదు, వేయకున్నా పరవాలేదు. ఒకటో నెంబరు వేయకుండా 2, 3 నెంబరు వేస్తే ఓటు చెల్లదు. పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది ఇచ్చే పెన్నును మాత్రమే వినియోగించాలి. ఓటు వేసేందుకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా ఎన్నికల కమిషన్ నిర్ణయించే 14 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తీసుకెళ్లాలి. ఆధార్, పాన్, ఓటరు గుర్తింపు కార్డు, ఫొటో ఉన్న పాస్ పోర్టు, పట్టాదారు పాస్ పుస్తకం, ఫొటో ఉన్న డ్రైవింగ్ లైసెన్సు, ఫొటో ఉన్న రేషన్ కార్డు, ఫొటో ఉన్న దివ్యాంగ ధ్రువీకరణ పత్రం తదితర కార్డుల్లో ఏదైనా ఒకటి ఉండాలి.

ఇవి చేయకూడదు

ఓటర్లు సొంత పెన్ను వాడకూడదు. ఒకే నెంబరు ఇద్దరు అభ్యర్థులకు ఇవ్వకూడదు. ఒకటో ప్రాధాన్యం సంఖ్య వేయకుండా మిగతా నెంబర్లు వేస్తే ఆ ఓటు చెల్లదు. ఒకటి అని రాయకూడదు. ఆంగ్లంలోనూ వన్ అని రాయకూడదు. ఎటువంటి గుర్తులు పెట్టకూడదు. పేర్లకు ఎదురుగానే సంఖ్య వేయాలి. రెండు పేర్లకు మధ్యలో సంఖ్య వేస్తే ఆ ఓటు చెల్లదు. అభ్యర్థులు ఎక్కువ మంది ఉంటే అందరికి తప్పనిసరిగా ఓటు వేయాల్సిన అవసరం లేదు. ప్రాధాన్య క్రమంలో మీకు నచ్చిన కొందరికి మాత్రమే అంకె వేస్తే సరిపోతుందని తహశీల్దార్ శ్రీనివాసరావు వివరించారు.

ఆశ్రమ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం హెచ్‌ఎం కె సుబ్బారావు

విశాలాంధ్ర-సీతంపేట: ఐటిడిఎ పరిధిలో గల ధోనుభాయ్ బాలుర ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రధానోపాధ్యాయుడు కే సుబ్బారావు, ఉపాధ్యాయులు సమీక్ష సమావేశం నిర్వహించారు. 10వ తరగతి పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో తల్లిదండ్రులు ఎవరు విద్యార్థులని ఇంటికి తీసుకువెళ్లేందుకు రావద్దని, పెళ్లిళ్లు, ఫంక్షన్ల ఉన్నాయని విద్యార్థులను తీసుకువెళ్లే విధంగా ఎవరు పాఠశాలలకు రావద్దని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకొని పరీక్షల్లో మంచి మార్కులు వచ్చే విధంగా ఉపాధ్యాయులంతా కృషి చేస్తున్నారని తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు గణపతి రావు మాస్టారు, ఉత్తరరావు, చిరంజీవి, పిడి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు జివి లో ముగిసిన జాతీయ సాంకేతిక సదస్సు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జె ఎన్ టి యు జీవి విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగంలో రెండు రోజులుగా జరిగిన జాతీయ సాంకేతిక సదస్సు ముగిసింది ఈ కార్యక్రమానికి పెన్నాట్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ దాట్ల రవివర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం వారి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని లేనియెడలఈపోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవడం కష్టమన్నారు. పుస్తకాల్లో ఉన్న నాలెడ్జికే పరిమితం కాకుండా ఎప్పటికప్పుడు నిరంతర టెక్నాలజీలను మెరుగుపరుచుకోవాలన్నారు. అనంతరం యూనివర్సిటీ ఇన్చార్జి రిజిస్టర్ ప్రొఫెసర్ జి స్వామినాయుడు మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో ప్రతి విభాగంలో విద్యార్థి మీ విభాగానికి సంబంధించిన విద్యార్థికి పోటీదారుడు అని అన్నారు మీయొక్క నైపుణ్యాలు మెరుగుపరుచుకుని ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని తెలియజేశారు. అనంతరం సాంకేతిక సదస్సులో జరిగిన వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కే శ్రీ కుమార్, డాక్టర్ పి అరుణకుమారి, ఎస్ అశోక్, కే ఫణీంద్ర, ఓ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కోరెడ్ల రమాప్రభ గేలుపు కై ప్రజా సంఘాల బైక్ ర్యాలీ

విశాలాంధ్ర-విజయనగరంటౌన్ : ఉత్తరాంధ్ర పట్ట బద్రుల ఎం ఎల్ సి ఎన్నికల్లో 250 ప్రజా సంఘాలు బలపరిచి పిడిఎఫ్ అభ్యర్థి డాక్టరు కోరెడ్ల రమప్రబ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు ఉద్యోగ సంఘాల నాయకులు %ఎ%. శ్రీనివాస, సీఐటీయూ నాయకులు రెడ్డి శంకరరావు, మాట్లాడుతూ ఉత్తరాంధ్రా అభివృద్ధి కోసం పోరాడుతున్న శక్తులకు అండగా ఉన్నది పిడిఎఫ్ అని స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం, ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షణ కోసం, ఉత్తరాంధ్ర లో నీటివనరులు వినియోగానికి సంబంధించి ప్రాజెక్టుల కోసం, నిరుద్యోగులు, విద్యార్థులు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న పిడిఎఫ్ అభ్యర్థి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని కోరారు. ఆలాగే బీజేపి, వైసీపీలు రాష్ట్రానికి రావలసిన ప్రత్యేక హోదా, విబజన హామీలు కోసం మాట్లాడటం లేదు, మూసివేసిన పరిశ్రమలు తెరిపించాలని, ఓ పి ఎస్ అమలు చేయాలని, శ్రామిక మహిళలు కి కనీస వేతనం ఇవ్వాలని, న్యాయ వ్యవస్థ స్వతంత్ర త కాపాడేందుకు, పిడిఎఫ్ అభ్యర్థి గెలుపు అవసరమని అన్నారు. యాప్ లతో ఉద్యోగ ఉపాధ్యాయ లని వేధిస్తున్న వైసిపి, రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపి లను ఓడించాలని కోరారు. కోటసుం డి ఆర్టీసి బస్టాండ్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి సురేష్,రవి, రమేష్ నాయుడు, రామమోహన్, శ్రీనివాస్, రామచంద్ర రావు, బి రమణ , తదితరులు పాల్గొన్నారు

7న వాహనాలు వేలం నిర్వహణ : రూరల్ ఎస్ఐ సింహాచలం

విశాలాంధ్ర-బెలగాం : రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో నాటుసారా రవాణా చేస్తూ పట్టుబడిన 15 వాహనాలను ఈనెల 15వ తేదీన రూరల్ పోలీసు స్టేషన్ ప్రాంగణంలో వేలంపాట నిర్వహిస్తున్నట్లు పార్వతీపురం రూరల్ ఎస్ఐ వై. సింహచలం తెలిపారు. ఉత్సాహవంతులు, ఆసక్తి కలిగినవారు ఆరోజు ఉదయం 11గంటలకు పోలీసు స్టేషనుకు వచ్చి వేలంలో పాల్గొనవలసిందిగా కోరారు. వేలం పాటలో వాహనానికి నిర్ణయించిన కనీసధరతో పాట నిర్వహిస్తామని చెప్పారు. నిబంధనల ప్రకారం వేలంపాట నిర్వహిస్తామని చెప్పారు.

ఈనెల 20న చలో విజయవాడ నోటీసు అందజేత

విశాలాంధ్ర-సీతానగరం: అంగన్వాడి సిబ్బంది సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఈనెల 20న చలో విజయవాడ నోటీసు ను ఐసిడిఎస్ పిఓ కు అంగన్వాడి కార్యకర్తల తరుపున నాయకురాలు గంట జ్యోతి అందించారు.సమస్యలు పరిష్కారం కోసం ఈకార్యక్రమంలో అంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ...

ప్రలోభాలకు గురి చేసే పనిలో అధికార ప్రతిపక్ష పార్టీలు

సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

వై. వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-బెలగాం: ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు సాధించడం కోసం అధికార ప్రతిపక్ష పార్టీలు ఓటర్లకు ప్రలోభాలకు గురి చేసే పనిలో ఉన్నాయని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో రాష్ట్ర ప్రభుత్వం ఓటర్లకు పెడుతున్న ప్రలోభాలపైన అలాగే ఎన్నికల కమిషన్ తీరుపైన శనివారం సిపిఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం 5 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయని ఇందులో మూడు స్థానాలు పట్టబద్దుల ఎమ్మెల్సీ అభ్యర్థులకు, రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీల కోసం జరుగుతున్న నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియ నుండి జరగబోయే ఎన్నికల వరకు అన్ని దశల్లోనూ అధికార పార్టీ అక్రమ మార్గాల ద్వారానే గెలుపు సాధించడం కోసం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తుందని, ఇప్పటికే విడుదల చేసిన ఓటర్ జాబితాలో బాగా తప్పుడు ఓటర్ల నమోదు జరిగిందని, పట్టభద్రుల ఓటర్ల లిస్టులో కేవలం పదవ తరగతి, ఐదో తరగతి చదివిన వ్యక్తుల పేర్లు ఉండటంతో ఓటర్ నమోదు ప్రక్రియ ఏ విధంగా జరిగిందో అర్థం చేసుకోవచ్చాన్నారు. రాష్ట్రంలో నేటి వరకు 8 వేలకు పైగా తప్పుడు ఓటరు నమోదులను గుర్తించినట్లుగా తెలియజేశారు. దీనిపై ఎన్నికల కమిషన్ కు అధికారులకు తెలియజేసినా తూతూ మంత్రంగా స్పందిస్తున్నారే తప్పితే, జరిగిన తప్పుదారిపై తీవ్రమైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లోకనాథం మాట్లాడుతూ ప్రభుత్వం పథకం ప్రకారం అధికారులందరినీ ప్రభుత్వానికి అనుగుణంగా ఎన్నికల్లో ఉపయోగించుకుంటూ ముందుకు సాగుతుందని, ఇప్పటికే అధికారులను ఓటర్లను ప్రభుత్వం అన్ని రకాల ప్రలోభాలకు గురి చేస్తూ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తుందనన్నారు. ఇప్పటికే కేజీబీవీ ఉపాధ్యాయులను, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను ప్రలోభాలకు గురి చేయడం జరిగిందని, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రత్యక్షంగా ఓటర్లను అధికారులను అధికార పార్టీకి అనుకూలంగా ఉపయోగించుకుంటూ, పిడిఎఫ్ అభ్యర్థిని ఏ విధంగా ఓడించాలని దృక్పథంతో తమ శక్తి యుక్తులను యదేచ్ఛగా వాడుకుంటున్నారని విమర్శించారు. ఇటువంటి చర్యలన్నీ ఆ ప్రజాస్వామికమని అన్నారు. వాటర్ లందరూ విచక్షణతో ఆలోచించి అధికార ప్రతిపక్ష పార్టీలు చూపే ప్రలోభాలకు మోసపోకుండా శాసనమండలిలో ప్రజా సమస్యలపై పోరాడే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. సిపిఎం పార్టీ మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో అధికార పార్టీ నాయకులు మహిళా దినోత్సవం పేరిట వాలంటీర్లను ఉపయోగించుకొని మహిళ ఓటర్లకు చీరలు పంపిణీ కార్యక్రమం చేపట్టారని, జిల్లాలో ఇప్పటికే కొన్నిచోట్ల వాలంటీర్లను సచివాలయ సిబ్బందిని బెదిరించి అధికార పార్టీ గెలుపుకు సహకరించేలా వాటర్లను వారి యొక్క బలహీనతలను బట్టి ప్రలోభ పెట్టమని ఒత్తిడి చేస్తున్నారని, ఇప్పటికే జిల్లాలో నమోదైన తప్పుడు ఓటర్లను గుర్తించడం జరిగిందని, ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించి వారి దగ్గర ఓట్లు అడిగే ధైర్యం లేక అధికారబలాన్ని ఉపయోగించి వాటర్లను ఇబ్బంది పెడుతూ, వాటర్ పైన, అధికారులు సిబ్బంది పైన ఒత్తిడి చేసి ఎన్నికల్లో గెలుపుకు ప్రయత్నించడం ఎంత దుర్మార్గమని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ పాల్గొన్నారు.

వేపాడకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి : టీడీపీ

విశాలాంధ్ర -పార్వతీపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా టీడీపి తరుపున పోటీచేస్తున్న వేపాడ చిరంజీవిరావుకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ జగదీశ్ , మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు పిలుపునిచ్చారు.శనివారం చివరిరోజు పట్టణంలోని పలువార్డులలో టీడీపీనాయకులతో కలిపి ప్రచారాన్ని నిర్వహించారు.పట్టభద్రుడైన ప్రతీఓటరు తమ అమూల్యమైన ఓటును ఆలోచనచేసి విజ్ఞుడైన చిరంజీవిరావుకు వేయాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, టిడిపిపట్టణ మండల పార్టీ అధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్, దొగ్గ మోహన్, టీడీపి నాయకులు గర్భాపు ఉదయభాను, తాతపూడి వెంకటరమణ, బడే గౌరునాయుడు, బోను దేవీచంద్ర మౌళి, నారాయణరావు, కెంగువ సుధీర్, బంకపల్లి రవికుమార్, కోలా వెంకటరావు, సిరిపురపు భాస్కరరావు, తాన్న ప్రసాద్, గొంగాడ రామమూర్తి, చందక దేశాలు, మరిశర్ల కార్తీక్ నాయుడు, శంబంగి తిరుపతిరావు, బేత లక్ష్మణరావు, మరియదాస్, జాగాన రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా టీడీపీ తరుపున పోటీచేస్తున్న డాక్టరు వేపాడ చిరంజీవిరావుకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని టీడీపీ నియోజక వర్గ ఇంచార్జి, మాజీఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు కోరారు.ఆయనతోపాటు టీడీపీనేతలు గొట్టాపు వెంకట నాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, బోనుచంద్రమౌళి, జాగాన రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. సీతానగరం మండలంలోని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు కొల్లితిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్, టీడీపి నాయకులు బుడితిశ్రీనివాసరావు, పైల నాగభూషణరావు, కె రామక్రిష్ణనాయుడు, ఉడమల సూర్యనారాయణ, భాస్కరరావు, శ్రీనివాసరావు,లక్ష్మణరావు, ఉమా, రెడ్డి సింహాచలంనాయుడు, సత్యంనాయుడు, గరికయ్య, సతీష్,గుంపస్వామి, సింహాచలం నాయుడు లక్ష్మణ, యోగేశ్వరరావు, జగన్నాధం, శంకరరావుతదితరులు ప్రచారం చేశారు. బలిజిపేట మండలంలోని పలుగ్రామాల్లోకూడా టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి చిరంజీవిరావుకు మద్దతుగా పార్టీ అధ్యక్షుడు పెంకి వేణుగోపాల్,నాయకులు వాడాడ రాము ఆద్వర్యంలో ప్రచారాన్ని నిర్వహించారు.

వైసీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి

విశాలాంధ్ర-సీతానగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న సీతంరాజు సుధాకర్ కు మొదటిప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని సీతానగరం మండల వైఎస్సార్సీపీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు పిలుపునిచ్చారు. శనివారం మండల కమిటీ, గ్రామకమిటీ నాయకులు గ్రామాల్లో పట్టభద్రుల ఓటర్ల ఇళ్లకు వెళ్లి చివరి సారిగా ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారు. పార్టీఅత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందనీ, తప్పనిసరిగా గెలిపించ డానికి ఓటర్లు సహకారాన్ని అందించాలని కోరారు. ఆయనతో పాటు మాజీ జెడ్పి చైర్మన్, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు వాకాడ నాగేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములు నాయుడు, జెడ్పీటీసీ బాబ్జి, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు పోల ఈశ్వం నారాయణ, నాయకులు కొట్నాన రత్నాకర్, తెంటు వెంకటఅప్పలనాయుడు, అంబటి కృష్ణం నాయుడు,ఆర్వీ పార్థసారథి, బుడితి గౌరునాయుడు, దాసరి నాగరత్నం, సురేష్, ఆర్వీ కిషోర్, సర్పంచులు, ఎంపీటీసీలు,కన్వీనర్లు,నాయకులు అభిమానులు, పాల్గొంటున్నట్లు చెప్పారు. ఇదిలాఉండగా పెదభోగీలి మేజర్ గ్రామపంచాయతీలో ఎంపీటీసీలు ఎస్.కిరణ్, బురిడి సూర్యనారాయణ, కూర్మారావు, రమేష్, పిల్లి సతీష్, ఆర్వీ కిషోర్, సురేష్, రామారావులు తదితరులు ప్రచారాన్ని నిర్వహించారు. ఆన్ని గ్రామాల్లో చివరి రోజున పట్టభద్రుల ఓటర్లను కలిసి ఓట్లు వేయమని ఆయా గ్రామాల నాయకులు ప్రచారాన్ని నిర్వహించారని పార్టీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు తెలిపారు.

సుధాకర్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి : ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర-పార్వతీపురం : ఈనెల 13వ తేదీన ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరుపున సీతంరాజు సుధాకర్ పోటీ చేయుచున్నారని, బ్యాలెట్ పేపర్లో సీరియల్ నంబర్ 3కి ఎదురుగా మొదటి ప్రాధాన్యత ఓటు 1 వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని పార్వతీపురం నియోజకవర్గం గ్రాడ్యుయేట్ ఓటర్లు అందరినీ కోరుతూ పేరు పేరునా విజ్ఞప్తి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు మీడియా ముఖంగా తెలియచేశారు. ఈ పత్రికా సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జే సి ఎస్ కన్వీనర్ గోర్లి మాధవరావు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వానపల్లి శంకర్రావు, వైసీపీ సీనియర్ నాయకులు, సచివాలయం కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

కరోనా కన్నా భయంకరమైంది ప్రభుత్వ వేధింపులు

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, మురళీమోహన్

విశాలాంధ్ర-బెలగాం: భోదనేతర పనులు రద్దు చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని, జిపిఎస్ అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, మెరుగైన పిఆర్సీ ఇవ్వాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వ ర్యంలో యుటిఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష, కార్యదర్సులు టి రమేష్, ఎస్. మురళీమోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఉరి తాళ్లతో నిరసన తెలిపారు.

8వ వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావును పార్టీ నుండి సస్పెండ్ చేయాలి : ద్వారపురెడ్డి

విశాలాంధ్ర -బెలగాం: పార్వతీపురం మునిసిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావును పార్టీ నుండి సస్పెండ్ చేయాలని పార్వతీపురం నియోజకవర్గం మాజీ శాసన మండలి సభ్యులు ద్వారపురెడ్డి జగదీశ్వరరావు, మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ ఇన్చార్జ్ బొబ్బిలి చిరంజీలు కలసి శనివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చంనాయుడుకు వినతిపత్రాన్ని పంపినట్లు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న 8వ వార్డు కౌన్సిలర్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. నారాయణరావు సోషల్ మీడియా వేదికగా నియోజకవర్గ పార్టీ నాయకులపై పోస్టులు పెట్టి శాసనమండలి ఎన్నికల సమయంలో పార్టీకి తీరనినష్టం కలిగించుచున్నాడని, సదరు కౌన్సిలర్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఒక్కరోజూ కూడా ప్రచారంలో పాల్గొనలేదని అధికార పార్టీ నాయకులతో కలిసి భూకబ్జాలు చేయడం, పార్టీ అత్యంత వివాదాస్పద వ్యక్తి గా ఇప్పటికే గుర్తింపబడ్డాడని, అదేవిధంగా పార్టీ కార్యాలయంలో అనేక సందర్భాలలో కార్యకర్తలపై చేయిచేసుకున్నాడని, అధికార పార్టీ నాయకులతో అంటకాగుతూ పార్టీకి అంతర్గతంగా నష్టపరుస్తూ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న కౌన్సిలర్ ను పార్టీ ఏమాత్రం నష్టం చేసి పార్టీకి జరుగుతున్న నష్టాన్ని పూడ్చువలసినదిగా కోరుతున్నామని పార్టీ నుండి సస్పెండ్ చేసినందువలన పార్టీకి ఏమాత్రం నష్టం జరగదని తెలియపరచామన్నారు.

సుధాకర్ కు ఓటు వేయండి

ఎంపిటిసి బురిడి సూర్యనారాయణ

విశాలాంధ్ర-సీతానగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థి సుధాకర్ కు ఓటు వేసి గెలిపించాలని సీతానగరం ఎంపిటిసి బురిడి సూర్యనారాయణ కోరారు.శనివారం అప్పయ్యపెట గ్రామంలో ప్రచారాన్ని నిర్వహించారు. పట్టభద్రులు తప్పని సరిగా ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.సీతానగరం మండలం కేంద్రంలో ఎంపీటీసీ కిరణ్, సహకార సంఘం అధ్యక్షుడు, తదితరులు ప్రచారం నిర్వహించారు. బుడ్డి పేటలో శంక రాపు వెంకట రమణ తదితరుల పాల్గొని ప్రచారం నిర్వహించారు.

డూప్లికేట్ ఓట్లు పై తగు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-పార్వతీపురం: నియోజక వర్గంలోని 9పోలింగు బూతులలో 190 డూప్లికేటు ఓట్లుపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ నాయకులు జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరావు కు వినతి పత్రాన్ని అందజేసారు. దీంతో పాటు పట్టణంలోని 12, 13వార్డుల వాలంటీర్లు , మరికొంత మంది వాలంటీర్లు వైఎస్సార్సీపీ తరుపున ప్రచారం చేస్తున్నారని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జగదీష్, మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు,నాయకులు రవి, తిరుపతిరావు, దోగ్గ మోహన్, గోట్టాపు వెంకట నాయుడు, ఉదయభాను, రవి శంకర్, కోలా బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు పార్టీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర,సీతానగరం:పార్వతీపురం ఎమ్మెల్యే అలజింగి జోగారావు ఆద్వర్యంలో వైఎస్సార్సీపీ పార్టీకార్యాలయంవద్ద (బెలగాం గూడ్స్ షెడ్ రోడ్డు వద్ద) పార్టీ 13వఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్సీపీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు తెలిపారు.ఎమ్మెల్యే సమక్షంలో కేకు కట్ చేయబడునని,మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, మండలనేతలు, గ్రామసచివాలయాల కన్వీనర్లు, పిటిసిలు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు.